
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 39 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 27, ఆగస్టు 2024 | ఎడిటర్: ఎం.వనిత రెడ్డి


## నేడు యాదాద్రికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

### బ్రేక్ దర్శనాల్లో మార్పులు చేసిన అధికారులు



హైదరాబాద్,ఆగస్ట్26(నమస్తే ఉదయం): తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ నెల 27వ తేదీన యాదాద్రి పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శ్రీలక్ష్మీనరసింహ స్వామికి గవర్నర్ ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో యాదాద్రిలో మంగళవారం బ్రేక్ దర్శన వేళల్లో మార్పులు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. భక్తుల బ్రేక్ దర్శన సమయం ఉదయం 10 గంటల నుంచి ఉదయం 10.30 గంటలకు మార్చినట్లు పేర్కొన్నారు. అంతరాలయ దర్శన సమయం ఉదయం 9.30 నుంచి ఉదయం 10 గంటలకు మార్చినట్లు తెలిపారు. యాదాద్రి పుణ్యక్షేత్రంలో ప్రతి మంగళవారం స్థానికులకు అంతరాలయ దర్శనం కల్పిస్తున్న సంగతి తెలిసిందే.

## జూరాలకు మళ్లీ పెరిగిన వరద



గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 26(నమస్తే ఉదయం): ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి మళ్లీ పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండడంతో సోమవారం సాయంత్రం జూరాల డ్యాంకు 93,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో అధికారులు 24 గేట్ల ద్వారా 95,064 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నెట్టెంపాడుకు 750క్యూసెక్కులు, ఎడమ కాలువకు 820 క్యూసెక్కులు, కుడి కాలువకు 496, కోయిల్ సాగర్ కు 315 క్యూసెక్కులు వదులుతున్నారు. అదే విధంగా విద్యుదుత్పత్తికి 31,689 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 1,29,228 క్యూసెక్కులు అవుట్ ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 7.855 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

## అలలు పోయి.. శిలలు..

### విశాఖలో 400 మీటర్లు వెనక్కి వెళ్లిన సముద్రం



విశాఖపట్నం, ఆగస్టు26(నమస్తే ఉదయం): ఇసుక తిన్నెలపై ఎగిరి.. చల్లగాలులు ఆస్వాదిస్తూ.. సాగర జలాల్లో ఆడాలని విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌కు చాలా మంది వెళ్తుంటారు. తీరా వెళ్లాక.. ఎగసిపడుతున్న అలలు చూసి వెనకడుగు వేస్తారు. శనివారం అలాంటి ఇబ్బందేం లేకుండా ఆ సముద్రుడే సుమారు 400 మీటర్లు వెనక్కి వెళ్లాడు. దీంతో పర్యాటకులు తీరంలో బయటపడ్డ రాళ్లపైకి చేరి ఉత్సాహంగా సెల్ఫీలు దిగారు. అయితే సాగర కదలికలు గమనించి అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## త్వరలోనే మరో.. 35వేల ఉద్యోగాల భర్తీ

- నిరుద్యోగులకు ప్రభుత్వం శుభవార్త
- విద్యార్థుల వల్లనే తెలంగాణ పోరాటం
- నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం
- త్వరలోనే యూనివర్సిటీల్లో వీసీల నియామకం
- తెలంగాణ అభివృద్దే మా లక్ష్యం అన్న సీఎం
- సివిల్స్ అభ్యర్థులకు లక్ష సాయం కింద చెక్కుల పంపిణీ
- సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ వెల్లడి



హైదరాబాద్,ఆగస్ట్26(నమస్తే ఉదయం): నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ఏర్పడ్డదే నిరుద్యోగుల సమస్యపై అని అన్నారు. విద్యార్థుల ఉద్యమం వల్లే రాష్ట్ర సాధన సాధ్యమైందని, నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 90 రోజుల్లో 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశా మని, మరో 35 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయబోతున్నామని ఆయన ప్రకటించారు. సరైన సమయం లో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. గ్రూప్-1, 2, 3 కావచ్చు..ఇతర ఉద్యోగాలు కావచ్చు.. ఖాళీలను భర్తీ చేసేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. ఇక విద్యార్థులు, కంపెనీల మధ్య గ్యాప్ వస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడు తాము నియామకాలు చేపడితే వాయిదా వేయాలని అంటున్నారని విపక్ష బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. వాళ్ల ఉద్యోగాలు పోయాకే నిరుద్యో గులు గుర్తుకొచ్చారని ఎద్దేవా చేశారు. విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలని చూశారని మండిపడ్డారు. 90 రోజుల్లో 30 వేల మందికి నియామక పత్రాలు అందించామని ప్రస్తావించారు. దుక్కల్లాగా ఉన్న బావ, బామర్దులు నిరుద్యోగ యువత కోసం అమరణ నిరాహారదీక్ష చేయాలని రేవంత్ విమర్శిం చారు. మా ప్రభుత్వం కష్టపడి చదువుతున్న విద్యార్థుల కోసం పని చేస్తోంది. పదేళ్లలో అధికారం కోసం పని చేసి ఇవాళ వాళ్లు రాజకీయ నిరుద్యోగులు గా మిగిలిపోయారు. మా కోసం మేము పని చేయము. మా కర్తవ్యం తెలంగాణ సమాజం కోసం కష్టపడి చేయడం అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సెక్రెటరీయేట్‌లో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఈ సాయాన్ని అందజేశారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన 135 మందికి రూ.1 లక్ష చొప్పున చెక్కులను పంపిణీ మిగతా..2లో

## ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపిక కావాలి



- ఆత్మస్థయిర్యం నింపడానికే లక్ష రూపాయల సాయం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్26(నమస్తే ఉదయం): రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మన రాష్ట్రం నుండి పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుండి ఎక్కువ మంది ఎంపిక అవ్వాలన్నారు. వాళ్లకు ఆర్థిక ఇబ్బంది నీ కొంతైనా తగ్గించాలని లక్ష రూపాయలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని, లక్ష పెద్ద నగదు కాకపోయినా.. కొంతైనా ఉపశమనం కలగాలని మా ప్రయత్నమని భట్టి విక్రమార్క అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఓపెన్ చేస్తున్నామని, ఐదు వేల కోట్లు మౌలిక వసతుల కోసం ఖర్చు చేయబోతున్నామన్నారు. గత ప్రభుత్వం 3 వేల కోట్లు ఖర్చు చేస్తే..మేము ఐదు వేల కోట్లు మిగతా..2లో

## సివిల్స్ మెయిన్స్ అభ్యర్థులకు లక్ష సాయం





- మొత్తం 135మంది అభ్యర్థుల ఎంపిక
- 113 మంది పురుషులు.. 22 మంది మహిళా అభ్యర్థులు

హైదరాబాద్,ఆగస్ట్26(నమస్తే ఉదయం): సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద రూ.1 లక్ష ఇస్తామని మిగతా..2లో

## కవిత బెయిల్‌పై నేడు సుప్రీంలో విచారణ



హైదరాబాద్,ఆగస్ట్26(నమస్తే ఉదయం): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్టు అయిన కవిత.. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉంటున్న సంగతి తెలిసిందే. మిగతా..2లో

## పాలీగ్రాఫ్ పరీక్షలో భిన్న కథనాలు


- కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం
- తాను వెళ్లేవరకు మరణించిన స్థితిలో డాక్టర్
- నిందితుడు సంజయ్‌రాయ్ వెల్లడించినట్లు కథనాలు

కోల్‌కతా,ఆగస్ట్26(నమస్తే ఉదయం): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా వైద్యురాలిపై హత్యాచార ఘటనలో ప్రధాన నిందితుడు సంజయ్‌రాయ్‌కి ఇటీవల



పాలీగ్రాఫ్ పరీక్షలు నిర్వహించారు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం అతడు కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ జైల్లో ఉండగా అక్కడే ఈ లై డిటెక్టర్ పరీక్ష చేపట్టారు. ఇందులో మిగతా..2లో

## కుప్పకూలిన భారీ శివాజీ విగ్రహం



- గతేడాది ఆవిష్కరించిన ప్రధాని మోడీ


ముంబై,ఆగస్ట్26(నమస్తే ఉదయం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది అట్టహాసంగా ఆవిష్కరించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ 35 అడుగుల ఎత్తయిన విగ్రహం సోమవారంనాడు కుప్పకూలింది. మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లా రాజ్‌కోట్ ఫోర్ట్‌లోని ఈ విగ్రహం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కూలిపోయినట్టు అధికారులు తెలిపారు. విగ్రహం కూలిపోవడానికి కారణం తెలియలేదు. అయితే, గత రెండు మూడు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు ఇందుకు కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. సీనియర్ అధికారులు, జిల్లా యంత్రాంగం హుటాహుటిన ఘటనా స్థలికి మిగతా..2లో

## కాశ్మీర్ స్టార్ కాంపెయినర్ ప్రధాని మోడీ

- మొత్తం 40మందితో ప్రచార సారథుల జాబితా

న్యూఢిల్లీ,ఆగస్ట్26(నమస్తే ఉదయం): జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే 15 మంది అభ్యర్థుల తొలి జాబితాను సోమవారంనాడు విడుదల చేసిన బీజేపీ తొలి విడత ప్రచారంలో పాల్గొనే 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను కూడా విడుదల చేసింది. ఆ ప్రకారం జమ్మూకశ్మీర్ లీడ్ క్యాంపెయిర్‌గా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉంటారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి, జేపీ నడ్డా మిగతా..2లో






## యూపిఐ తరహాలో యూఎల్ఐ సేవలు

- డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జర్నీలో యూఎల్ఐ కీలక భూమిక
- ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ వెల్లడి

బెంగళూరు,ఆగస్ట్26(నమస్తే ఉదయం): యూపీఐ సేవల ద్వారా డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం మిగతా..2లో



క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

# క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్ - ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## స్టేట్ మీట్ విజేతలను సన్మానించిన ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు26(నమస్తే ఉదయం):** క్రీడలు విద్యార్థులకు భవిష్యత్తులో ఎంత దోహదపడతాయని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తెలంగాణ స్టేట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ మెదక్ లో నిర్వహించిన స్టేట్ మీట్ లో విజేతలుగా నిలిచిన అథ్లెటిక్స్ జయలక్ష్మి 800మీటర్ల గోల్డ్ మెడల్, గణేష్ జావేలిన్ త్రో సిల్వర్ మెడల్, మహేష్ ట్రిపుల్ చైజ్ (3km) బ్రాంజ్ మెడల్ సాధించిన క్రీడాకారులను గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ... భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించి జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరచాలని మీ తల్లిదండ్రులకు, మన గద్వాలకు మంచి పేరు తీసుకురావాలని అభిందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, గోవిందు, పిఈటి కృష్ణయ్య అసోసియేషన్ అధ్యక్షులు, వెంకట్రాములు, సతీష్, నగేష్, రఘు, అశోక్, బీసన్న, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే మరో.. 35వేల ఉద్యోగాల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. సింగరేణి సంస్థ సాయంతో ఈపథకం కింద సాయం అందించారు. గత ప్రభుత్వ ప్రాధాన్యతలు ఏంటో పదేళ్ల కళ్లారా చూశామని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్ సర్వెంట్లు కావాలని ఆశిస్తున్నట్టు ఆయన చెప్పారు. సివిల్స్ ఉత్తీర్ణులై రాష్ట్ర ప్రతిష్టను పెంచాలని, మెయిన్స్‌లో ఉత్తీర్ణులైతే మళ్లీ ఆర్థికసాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. ఇక 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు పతకాలు వచ్చేలా కృషి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సచివాలయంలోకి ఎవరూ రాకుండా గతంలో పోలీసు పహారా ఉండేదని, గత ప్రభుత్వం నిరుద్యోగుల గురించి ఆలోచన చేయలేదని విమర్శించారు. నైపుణ్యాలు లేకపోవడంతోనే నిరుద్యోగ సమస్య పట్టిపీడిస్తోందని అన్నారు. యంగ్ ఇండియా వర్సిటీ ద్వారా 2 వేల మందికి శిక్షణ ఇస్తామని, యంగ్ ఇండియా వర్సిటీలో ఏటా 20వేల మందికి శిక్షణ ఇస్తామని వెల్లడించారు. వచ్చే విద్యాసంవత్సరంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తామని, ప్రతి నియోజకవర్గంలో

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ సిద్ధమవుతాయని అన్నారు. అయితే గత ప్రభుత్వం వర్సిటీలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. త్వరలో అన్ని వర్సిటీలకు నూతన వీసీలను నియమిస్తామని సీఎం రేవంత్ తెలిపారు. వర్సిటీల్లోని అన్ని ఖాళీ పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని, కొందరు ఉద్దేశపూర్వకంగానే నిరుద్యోగులను రెచ్చగొడుతున్నారని, రాజకీయ లబ్ధి కోసమే నిరుద్యోగులను వాడుకుంటున్నారని అన్నారు. ఉద్యోగ అర్హత పరీక్షలను వాయిదా వేస్తే నిరుద్యోగులకే నష్టమని, నిరుద్యోగులు చెప్పింది వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తమ ప్రాధాన్యత రైతులు, విద్యార్థులేనని రేవంత్ పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. 'చదువుకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో చాలా మంది ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో 25 నుంచి 30 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం. అని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకానికి ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి కాలరీస్ నిధులు సమకూరుస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపి రఘురామిరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరాం తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపిక కావాలి

(మొదటి పేజీ తరువాయి)

పెడుతున్నామని, విద్యకు అంత ప్రాధాన్యత ఇస్తున్నామని, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పన కి కృషి చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఈ దేశ చరిత్రలో ఎవరూ కూడా ఆలోచన చేసి ఉండరని, పెద్ద ఎత్తున ఈ స్కూల్స్ మొట్ట మొదటి సారి మొదటి సంవత్సరంలోనే రూ. 5 వేల కోట్లతో నిధులు ఖర్చుపెట్టబోంతోందన్నారు. రాష్ట్రంలో గతంలో రెసిడెన్షియల్ స్కూల్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ కోసం సంవత్సరానికి రూ.3 కోట్లు ఖర్చుపెట్టేదని, కానీ ఈ సంవత్సరం మేము రూ. 5 వేల కోట్లకు పెంచామని ఇది మా ప్రాధాన్యత అని చెప్పుకొచ్చారు. విద్య కోసం అంగన్వాడి దగ్గర నుంచి మొదలు కొని ప్రణాళికలు తయారు చేశామని వెల్లడించారు. హైయర్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీ పై ఫోకస్ పెట్టామన్నారు. మరోవైపు నేడు రాష్ట్రానికి 4వ సిటీ రాబో తుందని, ఆ ప్రాంతంలో స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. టెక్నాలజీ పెరుగుతున్న క్రమంలో ఇండస్ట్రీలకు అనుగుణంగా సిలబస్‌ను తయారు చేసేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. స్కిల్ వర్సిటీలో చదివిన ప్రతి ఒక్కరికీ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. దాదాపు రాష్ట్రంలోని 63 ఐటీఐలు కళాశాలలు మూసివేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఆ ఐటీఐలను అడ్వాన్స్ స్కిల్ సెంటర్‌లుగా భవిష్యత్తులో అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు.

## సివిల్స్ మెయిన్స్ అభ్యర్థులకు

# లక్ష సాయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. అందులో భాగంగా సోమవారం నాడు హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో సివిల్స్ ప్రిలిమ్స్ క్వాల్గి అయిన వారికి చెక్కులు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన తెలంగాణ అభ్యర్థులకు రూ.1 లక్ష రూపాయల చెక్కుల్ని అందజేశారు. మొత్తం 135 మంది సివిల్స్ అభ్యర్థులకు సీఎం రేవంత్ చెక్కులు అందజేశారు. ఇందులో 113 మంది పురుష అభ్యర్థులు కాగా, 22 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. జనరల్ 21 అభ్యర్థులు, ఓబీసీలు 62 మంది, ఎస్సీలు 19, ఎస్టీలు 33 మంది అభ్యర్థులు సివిల్స్ మెయిన్స్ కు అర్హత సాధించారు. వారికి రాజీవ్ గాంధీ అభయహస్తం పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఎంపీ రఘురాం రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, సింగరేణి సీఎండీ బలరాం, ఇతర అధికారులు హాజరయ్యారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 14 మంది అభ్యర్థులకు, వరంగల్ అర్బన్ నుంచి 12 మందికి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి 11 మంది, నల్గొండ నుంచి 10 మంది, ఖమ్మంలో 9, కరీంనగర్ నుంచి 8 మంది సివిల్స్ ప్రిలిమ్స్ క్వాల్గి అయ్యారు.

కుమురం భీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాళపల్లి, జోగులాంబ గద్వాల, మెదక్, నారాయణపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల నుంచి ఒక్కొక్కరు సివిల్స్ మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. చాలా జిల్లాల్లో జనరల్ అభ్యర్థులు ఒక్కరు కూడా మెయిన్స్ కు క్వాల్గి కాలేదు. సగం జిల్లాల్లో జనరల్ అభ్యర్థులు ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్ కు అర్హత సాధించలేకపోయారు.






కృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవికుమార్, ఉట్టి లాగుతున్న మున్సిపల్ చైర్మన్ గాయత్రీ రవికుమార్

# ఆత్మకూరులో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమీ వేడుకలు

**ఆత్మకూరు,ఆగస్టు26(నమస్తే ఉదయం):** మక్తల్ నియోజకవర్గం లోని ఆత్మకూర్ పట్టణ కేంద్రంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆత్మకూరు మున్సిపల్ కేంద్రంలో గోపాల కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి రవి కుమార్ పాల్గొని పూజ కార్యక్రమం నిర్వహించి పట్టణ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గోపాల కృష్ణ యాదవ సంఘం అధ్యక్షులు చంద్రయ్య, కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, పుర ప్రముఖులు సంఘం సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.






చైతన్య విలాస్ కాలనీ అమ్మాయిల కృష్ణాష్టమి వేడుకలు ఇస్తున్న పూజారులు, కృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కొడుతున్న యువతి

# చైతన్య విలాస్ కాలనీ రామాలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**రాజేంద్రనగర్, ఆగస్ట్ 26(నమస్తే ఉదయం):**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి చైతన్య విలాస్ కాలనీ రామాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాయంకాలం 6గంకు శ్రీ కల్పతరు మ్యూజిక్ అకాడమీ హరిణి మతియు శిష్యబృందంచే నిర్వహించిన సంగీత కార్యక్రమం ఆలరింపజేసింది.

అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువతి యువకులు చిన్నారులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# పాలీగ్రాఫ్ పరీక్షలో భిన్న కథనాలు

(మొదటి పేజీ తరువాయి)

నిందితుడు ఏం చెప్పారన్న వివరాలను అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే, పాలీగ్రాఫ్ పరీక్షలో నిందితుడు అసత్యం, పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. తాను వెళ్లేసరికే వైద్యురాలు చనిపోయిందని అతడు చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న ఈ దారుణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఆ మరుసటి రోజే సివిక్ వాలంటీర్ అయిన సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ కోర్టు ఆదేశాలతో నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్ష సమయంలో సంజయ్ అనాలోచితంగా, ఆత్రుతగా ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. అధికారులు అడిగిన ప్రశ్నలకు అవాస్తవాలు, సరిపోలని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందం ఆధారాలు చూపించి

నప్పుడు.. ఆ సమయంలో తాను అక్కడ లేనని నిందితుడు చెప్పాడట. అంతేగాక, తాను సెమినార్ హాల్‌కు వెళ్లేసరికి వైద్యురాలు అప్పటికే చనిపోయి ఉందని, భయంతో తాను అక్కడి నుంచి పారిపోయానని సంజయ్ చెప్పినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడికి పాలీగ్రాఫ్ పరీక్ష నిర్వహించే సమయంలో అతడి తరఫు డిఫెన్స్ లాయర్ లేకపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై న్యాయవాది స్పందిస్తూ.. పరీక్ష ఎక్కడ నిర్వహిస్తామన్నది అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, ఇది మానవహక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆరోపించారు. కాగా.. వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడింది తానేనంటూ అంతకు ముందు కోల్‌కతా పోలీసుల ఎదుట నిందితుడు నేరం అంగీకరించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇటీవల సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి చెందిన వైద్యబృందం నిందితుడి మానసిక తీరును విశ్లేషించింది. ఘటన సమయంలో ప్రతీ నిమిషం చోటుచేసుకున్న విషయాలను నిందితుడు గుక్కతిప్పకుండా మొత్తం ఎపిసోడ్‌ను వివరించాడని, అతడిలో పశ్చాత్తాపమే లేనట్లు కన్పించిందని కేసు దర్యాప్తులో పాల్గొన్న ఓ సీబీఐ అధికారి చెప్పినట్లు కథనాలు వెలువడ్డాయి. అయితే, ఆ తర్వాత అతడిని కోర్టులో హాజరుపర్చగా.. సంచలన ఆరోపణలు చేశాడు. తానే తప్పు చేయలేదని, కావాలనే తనను ఇందులో ఇరికించారని న్యాయస్థానంలో కన్నీళ్లు పెట్టుకున్నాడు.

# కాశ్మీర్ స్టార్ కాంపెయినర్ ప్రధాని మోడీ

(మొదటి పేజీ తరువాయి)

తదితరులు సైతం ఎన్నికల ప్రచారంలో కీలకంగా ఉంటారు. కాగా, స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రుల పేర్లను కూడా ప్రకటించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, హిమాచల్ ప్రదేశ్ సీఎం జైరామ్ ఠాకూర్ తొలిదశ ప్రచారంలో పాల్గొంటారు. బీజేపీ మాజీ ప్రధాన కార్య దర్శి, ఇటీవలే జమ్మూకశ్మీర్ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన రామ్ మాధవ్, జమ్మూకశ్మీర్ పార్టీ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జి తరుణ్ చుగ్, జమ్మూకశ్మీర్ బీజేపీ చీఫ్ రవీందర్ రైనా, ఎంపీ జుగల్ కిషోర్ శర్మ, రాజ్యసభ సభ్యుడు గులాం అలీ ఖతన, ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) అశోక్ కౌల్, జమ్మూకశ్మీర్ బీజేపీ ఉపాధ్యక్షుడు సోఫి యూసుఫ్ సైతం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. 90 మంది సభ్యుల జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి మూడు విడతలుగా సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1న పోలింగ్ జరుగుతుంది.

అక్టోబర్ 4న ఫలితాలు వెలువడతాయి. 2019లో 370వ అధికరణ రద్దు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించిన తరువాత జమ్మూకశ్మీర్‌లో జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవే కావడం విశేషం.

# అవినీతికి పాల్పడే పోలీసులపై చర్యలు

## అవసరమైతే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం

## హైదరాబాద్ సిపి కఠిన హెచ్చరికలు

**హైదరాబాద్,ఆగస్ట్26(నమస్తే ఉదయం):** లంచాలు, వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడినట్టు రుజువైతే ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తామని తేల్చి చెప్పారు.



పలుమార్లు హెచ్చరించినప్పటికీ తీరుమారని అధికారులపై నిఘా పెడతామని వివరించారు. మసాజ్ సెంటర్లు, చిరు వ్యాపారుల, పాన్ షాపుల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడొద్దని హైదరాబాద్ సీపీ శ్రీనివాస రెడ్డి సూచించారు.

హైదరాబాద్ పోలీసులపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ మేరకు సీపీ స్పందించారు. అవినీతికి పాల్పడిన వారిని గుర్తించి సర్వీస్ నుంచి తొలగి స్తామని వార్నింగ్ ఇచ్చారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి అవినీతి ఆరోపణలు జోరుగా వినిపిస్తు న్నాయి. ఆ క్రమంలోనే పోలీసుల అవినీతి ఆరో పణలపై సీపీ ఘాటుగా స్పందించారు. సస్పెండ్ చేయడం అంటూ ఉండదని, సర్వీస్ నుంచి తొలగి స్తామని హెచ్చరించారు.

# కవిత బెయిల్‌పై నేడు సుప్రీంలో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ఆమె ఇటీవలే తీవ్ర అస్వస్థతకు గురికాగా, ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. అనంతరం తిరిగి జైలుకు తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ కవిత మార్చి 15వ తేదీ నుంచి తీహార్ జైల్లో ఉంటున్నారు. కవిత తరపున ప్రముఖ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించనున్నారు. దీంతో ఈసారి కవితకు బెయిల్ తప్పకుండా వస్తుందనే నమ్మకంతో బీఆర్ఎస్ నాయకత్వం ఉంది. కవిత మార్చిలో జైలుకు వెళ్లగా.. జూలై 16న తొలిసారి అస్వస్థతకు గురయ్యారు. అప్పుడు కవితను ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజుల తర్వాత 18న ఆమెను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరచగా, తనకు ఎదురవుతున్న అనారోగ్య సమస్యలను జడ్జి కావేరి బవేజా దృష్టికి తీసుకెళ్లారు. కవిత విజ్ఞప్తి మేరకు ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతి ఇచ్చారు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడలేదు. జైలు వైద్యులే ఆమెకు వైద్యం అందిస్తున్నారు. మళ్లీ ఆగస్టు 22న కవిత అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఢిల్లీ ఎయిమ్స్‌కు కవితను తరలించి.. ఆమె భర్త అనిల్ సమక్షంలో వైద్య పరీక్షలు చేశారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో తిరిగి జైలుకు తరలించారు. ఆమె సుమారు ఐదున్నర నెలల నుంచి జైలులోనే ఉన్నారు. జైలుకు వెళ్లిన తర్వాత ఆమె సుమారు 11 కేజీల బరువు తగ్గారు.

## యూపిఐ తరహాలో

# యూఎల్ఐ సేవలు

(మొదటి పేజీ తరువాయి)

చుట్టిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరో కొత్తతరహా సేవలకు నాంది పలకనుంది. రుణాలు తీసుకోవడాన్ని సులభతరం చేయడం కోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ ను జాతీయస్థాయిలో త్వరలో లాంచ్ చేయనుంది. గతేడాదే 'ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్' పేరిట పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన ఆర్‌బీఐ అవి సత్ఫలితాలు ఇవ్వడంతో త్వరలో దేశవ్యాప్తంగా సేవలు అందించేందుకు సిద్ధమైంది. డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో యూపీఐ ఏవిధమైన పాత్ర పోషిస్తోందో.. రుణ వితరణలో యూఎల్ఐ కూడా అదే పాత్ర పోషించబోతోంది. దేశ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జర్నీలో యూఎల్ఐ కీలక భూమిక నిర్వహించబోతోందని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. బెంగళూరులో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన దీనిపై మాట్లాడారు. భూ రికార్డులు మొదలుకొని, ఇతర ముఖ్యమైన డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా యూఎల్ఐ పనిచేస్తుందని చెప్పారు. దీనివల్ల రుణ ఆమోద పక్రియ సరళతరం కానుందని తెలిపారు. రుణం పొందేందుకు డాక్యుమెంటేషన్ పక్రియ అవసరం ఉండదని శక్తికాంతదాస్ వివరించారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాల జారీ వేగవంతం కానుందని పేర్కొన్నారు. గతేడాది ఆగస్టు 17న ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్ పేరిట పైలట్ ప్రాజెక్ట్‌ను లాంచ్ చేశారు. ఆర్‌బీఐకి చెందిన రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ ద్వారా దీన్ని చేపట్టారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపులు సెకన్లలో జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే భారతదేశంలో రిటైల్ డిజిటల్ చెల్లింపు వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే వచ్చినయూపిఐ చెల్లింపు వ్యవస్థ విజయవంతమైంది. ఈ నేపథ్యంలో రుణ ఆమోదం వ్యవస్థ క్రమబద్ధీకరించ బడుతుందని, తద్వారా చాలా తక్కువ సమయంలో ప్రజలకు రుణాలు ఇవ్వబడతాయన్నారు. తక్కువ మొత్తంలో రుణాలు తీసుకునే వారు దీని వల్ల ఎంతో ప్రయోజనం పొందుతారని గవర్నర్ అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ తర్వాత యూని ఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్‌ని త్వరలో దేశవ్యాప్తంగా ప్రారంభిం చనున్నట్లు ఆర్‌బిఐ గవర్నర్ తెలిపారు. ఈ ప్లాట్‌ఫారమ్‌లో బహుళ డేటా ప్రొవైడర్‌లతో పాటు రుణ సంస్థలు వివిధ రాష్ట్రాల భూ రికార్డులను కూడా కలిగి ఉంటాయన్నారు. దీని ద్వారా మరింత డిజిటల్ సమాచారం అందుబాటులో ఉంటుందని శక్తికాంత దాస్ చెప్పారు. దీంతో చిన్న, గ్రామీణ ప్రాంతాల వ్యక్తులకు తక్కువ సమయంలో సులభంగా రుణాలు ఇవ్వవచ్చన్నారు. ఈ వ్యవస్థ ద్వారా భారీ డాక్యుమెంటేషన్ నుంచి బయటపడతారని చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయం, ఎంఎస్-ఎస్ఈ రంగానికి సంబంధించిన వ్యక్తులు రుణం తీసుకోవాలనుకునే వారికి మంచి ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.

# కుప్పకూలిన భారీ శివాజీ విగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

చేరుకోగా, విగ్రహం కూలిపోవడానికి కారణాలు, ఏ మేరకు నష్టం జరిగిందనే దానిపై నిపుణుల అంచనా వేస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది డిసెంబర్ 4న 'నేవీ డే' సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రాజ్‌కోట్ ఫోర్ట్‌లో జరిగిన వేడుకల్లో సైతం పాల్గొన్నారు. శివాజీ మహరాజ్ 35 అడుగుల విగ్రహం కుప్పకూలడానికి ప్రభుత్వానిదే బాధ్యత అని ఎన్‌సీపీ (ఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి జయత్ పటేల్ ఆరోపించారు. ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోలేదని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదని, కేవలం ప్రధానమంత్రితో విగ్రహావిష్కరణ చేయించడం పైనే దృష్టి పెట్టిందని విమర్శించారు. కొత్త టెండర్లు పిలవడం, కమిషన్లు తీసుకుని కాంట్రాక్టులు ఇవ్వడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఎద్దేవా చేశారు. కాగా, విగ్రహ నిర్మాణంలో నాసిరకం ప్రమాణాలు పాటించినట్లు శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే వైభవ్ నాయక్ ఆరోపించారు. బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోందని, విగ్రహ నిర్మాణం, ఏర్పాటు చేసిన వ్యక్తులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.



టేక్కలయ్య దర్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

# అన్ని మతాల సారాంశం ఒక్కటే.. - ఎమ్మెల్యే జిఎంఆర్


### ఘనంగా కొత్తకోట టెక్కలయ్య దర్గా ఉర్సు ఉత్సవాలు

**కొత్తకోట, ఆగస్ట్ 26(నమస్తే ఉదయం):**
అన్ని మతాల సారాంశం ఒకటేనని దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు గివెనోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో టెక్కలయ్య దర్గా ఉర్సు సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఉర్సు ఉత్సవాలలో పాల్గొని దర్గాను దర్శించుకుని ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రారంభమైన జమ్మిచేడు జమ్ములమ్మ కళ్యాణోత్సవం

### ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు26(నమస్తే ఉదయం):**
కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా కొలిచే జమ్మిచేడు జమ్ములమ్మ కళ్యాణోత్సవం సందర్భంగా కళాకారులు వివిధ రూపాలలో దర్శనమిచ్చి భక్తులను భక్తి పరవశంలో




ముంచెత్తారు. కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి జములమ్మ ఆలయం నుంచి కళాకారులు ప్రత్యేక ఆకర్షణలో నృత్యాలు చేస్తూ జమ్మిచేడులోని ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకున్నారు ఆలయ పరిసరాలలో జరిగిన ఎదుర్కొళ్ళ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు..

# ఘనంగా మాజీ మేయర్ దివంగత కృష్ణస్వామి ముదిరాజ్‌కు నివాళులు

**కూకట్‌పల్లి, ఆగస్టు 26 (నమస్తే ఉదయం):**
కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని శోభన కాలనీలో ముదిరాజ్ సంఘ వ్యవస్థాపకులు, సంఘ సంస్కర్త, మాజీ మేయర్ కీ.శే. శ్రీ కృష్ణ స్వామి ముదిరాజ్ 131వ జయంతి వేడుకలు బాలానగర్ శోభన బస్ స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద



స్వర్గీయ మేయర్ కృష్ణ స్వామికు నివాళులర్పిస్తున్న నాయకులు

కూకట్ పల్లి ముదిరాజ్ బంధువులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషేర్మన్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల నరేందర్ ముదిరాజ్, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# ఓకే రిజిస్ట్రేషన్ నెంబర్‌పై రెండు ఆటోలు

**రాజేంద్రనగర్, ఆగస్టు26(నమస్తే ఉదయం):** ఒకే నెంబర్ పై రెండు ఆటోలు తిరుగుతుండగా ఈ రెండు ఆటోలను తనిఖీలలో భాగంగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు... రాజేంద్రనగర్ సర్కిల్ దుర్గా నగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్







పోలీసులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒకే రిజిస్ట్రేషన్ తో ఉన్న రెండు వాహనాలు ట్రాఫిక్ పోలీసులకు కనిపించాయి. వెంటనే అలర్ట్ అయిన ట్రాఫిక్ పోలీసులు రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని విచారించగా అందులో ఒకటి ఒరిజినల్ రిజిస్ట్రేషన్ మరొకటి అదే నెంబర్ తో నెంబర్ ప్లేట్ పెట్టుకొని ఆటో నడిపిస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు....
రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం ఈ రెండు ఆటోలను మైలార్ దేవ్ పల్లి పోలీసులకు అప్పగించారు.


# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలి: ఎంపీ రఘునందన్ రావు

### సభ్యత్వ నమోదు సన్నాహాలు

### ముఖ్య అతిథిలుగా వచ్చిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు

### చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్ రావు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

**మొయినబాద్ ఆగస్టు 26(నమస్తే ఉదయం):**
స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా శ్రేణులు పనిచేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు, బిజెపి సభ్యత్వ నమోదు రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి ఎం రఘునందన్ రావు పిలుపునిచ్చారు. సోమవారం మోహినా బాద్ మండలంలోని
మండల పరిధిలోని అజీజ్ నగర్ గ్రామ సమీపంలో గల చాందిని గార్డెన్ లో బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెవెస్ రత్నం సెప్టెంబర్ ఒకటో తేదీ నుండి ప్రారంభమయ్యే మెంబర్ షిప్ కార్యక్రమనికి బూత్ స్థాయి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు . ప్రతి ఒక్క కార్యకర్త 200 మందిని సభ్యత్వం చేయించాలన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లాలో అత్యధిక బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. రంగారెడ్డి జిల్లా మొత్తం ఆరు లక్షల సభ్యత్వాన్ని పూర్తి చేయాలి, ప్రజల దగ్గరికి వెళ్లి మన పార్టీ పెట్టుకున్న టార్గెట్ ని పూర్తిచేసి రాష్ట్రం లోనే మొదటి స్థానంలోఉండేలా చూడాలని కోరారు. చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... దేశంలోనే రంగారెడ్డి జిల్లా రూరల్ ఏరియా మొదటి స్థానం లో ఉండాలి ఎలక్షన్ లో పాల్గొన్నంటే సభ్యత్వం లో పాల్గొనాలి
బీజేపీ దళితులకు వ్యతిరేకం అనే దుష్ప్రచారం వ్యతిరేకించాలి, బీజేపీ సిద్ధాంతం కోసం, దేశం కోసం పనిచేసే పార్టీ, మనకు మీడియా అవసరం లేదు ప్రజలే మనకు మీడియా విధానం, సిద్ధాంతం లేని పార్టీ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా లో మహిళ సభ్యత్వాన్ని పెంచాలి, ఏబీవీపీ, పార్టీ అన్ని మోర్చా విభాగాలను ఇందులో భాగస్వామ్యం చేయాలి మెదక్ ఎంపీ రఘునందన్ రావు:పార్టీ రంగారెడ్డి జిల్లా సభ్యత్వ ఇంచార్జ్ గా నియమించినందుకు పార్టీ కి కృతజ్ఞతలు
వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఈ సభ్యత్వ నమోదు టార్గెట్ మించి పూర్తి చేయాలి మెదక్ లో బిఆరెస్ ని ఓడించడంలో బూత్ స్థాయి కార్యకర్తలే ముఖ్య భూమిక పోషించారు, బిఆరెస్ ఎన్ని డబ్బులు పంచిన మా కార్యకర్తల కృషి ముందు పని చేయలేదు బీజేపీ మెజారిటీ తో గెలిసింది బీజేపీ నాయకులకు సభ స్టేజి పైన స్థానం కాదు ప్రజల గుండెల్లో స్థానం, ప్రజల్లో మంచిపేరు అన్నివిధాల అందుబాటులో ఉండే వారికే విజయం వరిస్తుంది వచ్చే నవంబర్ లో స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది కాబట్టి మనం ప్రజలకు అందుబాటులో ఉండాలి ఒక బూత్ కి 200 మందిని పార్టీ మెంబెర్ షిప్ చేయించాలి, నిజాయితీగా మెంబెర్ షిప్ చేయించిన వారిని స్థానిక సంస్థ ఎన్నికల్లో, పార్టీ పదవుల్లో అవకాశం కల్పిస్తాం మెదక్ లో నేను గెలుస్తాను అని నమ్మి నన్ను అభినందించిన వ్యక్తి విశ్వేశ్వర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ కూడా బీజేపీ పార్టీ గెలవాలి, ఆ లక్ష్యం పెట్టుకొని బీజేపీ వారు పని చేయాలి దుబ్బాక లో 1,90,000 ఓటర్లలో యాభై వేల మందిని మెంబర్ షిప్ చేశారు, అలాగే రంగారెడ్డి జిల్లా బీజేపీ అడ్డా అనేలా మెంబెర్ షిప్ చెయ్యాలి, ప్రధాని మోడీ, అమిత్ షా ఎప్పుడు వచ్చినా రంగారెడ్డి జిల్లా గుర్తుంచుకునేల సభ్యత్వం చేయాలి
మోడీ దేశ నాయకుడు కాదు ప్రపంచ నాయకుడు ఆయన మార్గదర్శనం లో ప్రపంచంలోనే అత్యంత సభ్యత్వం కలిగిన పార్టీ గా అవతరించింది
జీవో 111 లో పెద్ద వ్యక్తులకు ఫార్మ్ హౌస్ లు ఉన్నాయి, బీజేపీ లో హైడ్రా విషయంలో రెండు మాటలు లేవు, అందరం ఒకే మాట పై ఉన్నాం, చెరువులు, కుంటలు, నాలా లు, బఫర్ జోన్ లో ఉన్నవి అన్ని కులగొట్టాలనే విధానం పై కట్టుబడి ఉన్నాం హైడ్రాకి బీజేపీ వ్యతిరేకం కాదు స్వాగతిస్తున్నాం, హైడ్రా విషయంలో కాంగ్రెస్, బిఆరెస్ రాజకీయాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారు తప్ప చిత్తశుద్ధితో పని చేయడంలేదు రాష్ట్రంలో హైడ్రా ఒక్కటే లేదు ప్రజలు విష జ్వరాలు వస్తుంటే, విద్యార్థుల సమస్యలు, రైతుల సమస్యలు, గ్రామ సమస్యలు ఇలా చాలా సమస్యలపై రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి, అలాగే దేవాలయ భూములను కబ్జా చేస్తే వాటిని కూల్చాలని, వాటిని కాపాడ దానికి వ్యవస్థను ఏర్పాటుచేయాలి.

# హైడ్రా పనితీరు భేష్ : చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి

### చెరువులు కాలువలకు మోక్షం కలిగించాలి : హైడ్రాకు మూడు సూచనలు చేసిన విశేశ్వర్ రెడ్డి

**శంషాబాద్, ఆగస్ట్ 26( నమస్తే ఉదయం):**
హైదరాబాద్ పరిధిలో హైడ్రా చేపడుతున్న కూల్చివేతల కార్యక్రమాన్ని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డి సమర్థించారు. హైడ్రా పనితీరు బేష్ గా ఉన్నదని పేర్కొన్నారు. .అయితే బిజెపి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్. రఘునందన్ రావు. శాసనసభ్యుడు కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించిన విధంగా అందులో ఉన్న కొన్ని లోపాలను సవరించి ముందుకు సాగితే మంచి ఫలితాలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. సోమవారం శంషాబాద్ లోని తొండుపల్లి వద్ద మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చేపట్టిన హైదరాబాద్ ఆపరేషన్ ను అభినందించారు. జన్వాడలో కేటీఆర్ నిర్మించిన ఫామ్ హౌస్ తనది కాదు అని పేర్కొనడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ఫామ్ హౌస్ గురించి ఏ చిన్న పిల్లాడిని అడిగినా అది కేటీఆర్ ది అని చెప్తారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో విచ్చలవిడిగా సాగిన చెరువులు. కాలువలు. శిఖం భూముల ఆక్రమణ దారులు అదేవిధంగా దేవాదాయ భూములను ఆక్రమించిన వారిని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

ఆయన మూడు సూచనలు చేశారు. ఆక్రమణలకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కూల్చివేసిన ప్రాంతాల్లోని వ్యర్థ పదార్థాలను వారి ఖర్చులతోనే తొలగించి చెరువులు కాలువలకు యధాస్థితి తీసుకురావాలని విశ్వేశ్వర్ రెడ్డి సూచించారు. అదే సమయంలో బిల్డర్ల దగ్గర ప్లాట్లు ఖరీదు చేసి నష్టపోయిన వారిని బాధితులుగా గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని సూచించారు. అక్రమాలకు పాల్పడిన వారితో పాటు వారికి సహకరించిన ప్రభుత్వ అధికారులపై కూడా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేటీఆర్ ఫామ్ హౌస్ చెరువులో లేనప్పటికీ 111 జీవో పరిధిలో ఉండడంతో పాటు అక్కడ ఉన్న ఛానల్ ఫీడర్ ను ధ్వంసం చేసి నిర్మించారని దీనిని తీవ్రమైన నేరంగా పరిగణించాలని విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి. ఏ. స్వర్ణలత భీమార్జునారెడ్డి.కొండ పరమేష్ గౌడ్. కొండ ప్రవీణ్ గౌడ్. కోనమోల దేవేందర్. కుమారి. బాతుకు శ్రీనివాస్ యాదవ్. తిరుపతి. కొలను జగ్జీవన్ రెడ్డి. గాజుల రాహుల్. సుఖేందర్.మునగాల రాజిరెడ్డి. వీరేందర్ రెడ్డి. మహిపాల్ రెడ్డి. విజయ భాస్కర్ రెడ్డి.తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాల వినియోగంతో ఆరోగ్యం సొంతం - పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. ఖాదర్ వలి

### సిరిధాన్యాలతో జీవనసిరిపై జరిగిన 3 రోజుల అవగాహన సదస్సు

**శంషాబాద్, ఆగస్టు 26(నమస్తే ఉదయం):**
సిరిధాన్యాలను మనం నిత్యం తీసుకునే ఆహారంలో వినియోగిస్తే ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని పద్మశ్రీ పురస్కార గ్రహీత, స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి సూచించారు. మన పూర్వీకుల ఆహార అలవాట్లను చిరుధాన్యాలను పక్కకు నెట్టి బియ్యం, గోధుమలు లాంటి ఆహారధాన్యాలను ఉపయోగించేలా మన జీవనశ్కెలి మారిందని, వీటి ఫలితమే నేడు మానవ సమాజాన్ని పట్టి పీడిస్తోన్న అతి పెద్ద సమస్య అనారోగ్యం అన్నారు. ప్రజలు అవసరాలను పక్కకు నెట్టి అనుకరణలకు ప్రాధాన్యతనివ్వడానికి బానిసల్కెపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగమే విపరీతంగా ప్లాస్టిక్ వాడకం, ప్రాసెసింగ్ ఫుడ్, జంక్ ఫుడ్ మొదలగు విదేశీ ఆహార అలవాట్లను అలవాటు చేసుకోవడంతో పాటు కృత్రి మమ్కైన సౌందర్య సాధనాలను విపరీతంగా ఉపయోగించడం లాంటివి విదేశాల నుండి మనం దిగుమతి చేసుకున్నవే. మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నామని స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి స్పష్టం చేశారు. గడచిన వందేళ్ళలో మారిన జీవన విధానం, ఆహార ఉత్పత్తి పద్ధతి, తీసుకునే ఆహారంలో చోటు చేసుకున్న




మార్పులే ఈ విపత్తుకి కారణమని చెప్పారు. ఈ సమస్యకు సిరిధాన్యాలు, కషాయాలే పరిష్కారమని గత 3 రోజులుగా హైదరాబాద్ ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 'రైతునేస్తం ఫౌండేషన', 'స్వర్ణభారత్ ట్రస్ట్' సహకారంతో 'కర్షక సేవా కేంద్రం' నిర్వహణలో జరుగుతున్న 'సిరిధాన్యాలతో జీవనసిరి' అవగాహన కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్ వలి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ముఖ్య కార్యనిర్వ హణాధికారి డి.వి.ఎన్. రావు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు, డాక్టర్ సరళా ఖాదర్ పాల్గొన్నారు.
150 ఏళ్ల క్రితం మధుమేహం అంటే ఎవరికీ తెలియదని, కానీ నేడు దేశవ్యాప్తంగా ప్రతి 100 మందిలో 20–25% మంది మధుమేహంతో బాధపడుతున్నారని డా. ఖాదర్ వలి అన్నారు. పుట్టే ప్రతి 100 మంది పిల్లల్లో 10 నుండి 15 మంది బుద్ధిమాంద్యంతో పుడుతున్నారని వివరించారు. ఈ సమస్య లన్నిటికి పోషకాలు లేని ఆహారం తీసుకోవడమే ప్రధాన కారణ మని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం కొర్రలు, అండు కొర్రలు, ఆరికలు, సామలు, ఊదలతో పాటు కషాయాలను ఆహారంగా తీసుకుంటే ఆరు నెలల్లో ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడుతుందని డాక్టర్ ఖాదర్ వలి వివరించారు. పాలు, టీ, కాఫీ, ప్లాస్టిక్ కవర్లలో, శుద్ధిచేసిన ఆహారాలను మానే యాలని సూచించారు. మధుమేహం, బీపీ, థైరాయిడ్ వంటి రోగాలను నయం చేసే శక్తి 5 సిరిధాన్యాలకు, కషాయాలకు ఉందని డాక్టర్ ఖాదర్ వలి వివరించారు.

# కొడుకు పుట్టి మరణించడంతో మనస్థాపానికి గురై తండ్రి ఆత్మహత్య

- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపూరంలో విషాద ఘటన. విషాదంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులు.
- తనకు పండంటి మొగ బిడ్డ పుట్టి చనిపోయాడని తీవ్ర మనస్తాపం చెందిన అంజనేయులు.
- గదిలో ఫ్యాన్‌కు ఉరి చేసుకొని బలవన్మరణం. ఎంతకీ కొడుకు బయటకి రాకపోవడంతో తలుపులు తట్టిన తల్లి.
- ఫ్యాన్‌కు వ్రేలాడుతూ కనిపించిన కొడుకు. కన్నీరు మున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు.
- 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన కుటుంబ సభ్యులు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న కాప్స్.

**రాజేంద్రనగర్,ఆగస్టు26(నమస్తే ఉదయం):**
కుమారుడు పుట్టి మరణించడంతో మనస్థాపానికి గురైన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మైలార్ దేవ్ పల్లి డివిజన్ పద్మశాలిపురం బస్తీలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పద్మశాలి పురం కు చెందిన విభూది గోపాల్ కు ఇద్దరు కొడుకులు, ఇద్దరూ అమ్మాయిలు సంతానం. పెద్ద కుమారుడు ఆంజనే యులు (26) వివాహం సంవత్సరం క్రితం దేవరకొండకు చెందిన సరిత అనే యువతీతో జరిగింది. వారం రోజుల క్రితం వారికి ఒక బాబు పుట్టి మరణించాడు . అప్పటినుంచి ఆంజనేయులు మనస్థాపానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంత చెప్పినా వినిపించుకోలేదు.
ఆదివారం రాత్రి అందరూ నిద్రపోయారు. సోమవారం ఉదయం కొడుకు ఎంతకు నిద్ర లేవకపోవడంతో కుటుంబ సభ్యులు ఆంజనేయులును నిద్ర లేపడానికి తలుపులు కొట్టగా ఆయన నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న మైలార్ దేవ్ పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆంజనేయులు



ప్రగతి భవన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న మైలార్ దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి. నరేందర్

## వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనోత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి

**- మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్**

**రాజేంద్రనగర్, ఆగస్టు26(నమస్తే ఉదయం):** వినాయక నవరాత్రి ఉత్సవాలు,నిమజ్జనోత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని మైలార్ దేవ్ పల్లి ఇన్‌స్పెక్టర్ పి.నరేందర్ మండపాల నిర్వాహకులకు తెలియజేశారు. సోమవారం మైలార్ దేవ్ పల్లి ప్రగతి భవన్ లో మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండపాల నిర్వాహకులు వినాయకులు ఎక్కడెక్కడ ప్రతి ష్ఠి స్తున్నారో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి మండపం వద్ద ఉదయం, రాత్రి వేళలలో మండపాల నిర్వాహకులు కాపలా ఉండాలన్నారు. నిమజ్జనోత్సవాల ను వెలుగు పూట తొందరగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు రాములు, పైడి నాయుడు, కృష్ణ , సత్య కుమార్ లు పాల్గొన్నారు.

## పాతబస్తీలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో పూజలు ఆలయ పూజారి హనుమాన్ శర్మ

**చార్మినార్, ఆగస్టు26(నమస్తే ఉదయం):** హైదరాబాద్ పాత బస్తీలో సోమవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. చార్ కమాన్ లోని శ్రీ గోపాల్ మందిరంలో భక్తులు శ్రీ కృష్ణ భగవానునికి అభిషేకాలు,పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గోపాల మందిరం కమిటీ ప్రతినిధులు హనుమాన్ శర్మ,అనిల్ శర్మ,భజాజ్ శర్మ,ప్రదీప్ శర్మ,అనిల్ సంఘితో పాటు పలువురు పాల్గొన్నారు.

## గణేష్ మండపం పెట్టాలంటే కొత్త రూల్

### ఈ డ్యాకుమెంట్లు తప్పనిసరి..!

**హైదరాబాద్, ఆగస్టు26(నమస్తే ఉదయం):** హైదరాబాద్‌లో వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసేందుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పోలీసులు స్పష్టం చేశారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు



https://www.tspolice.gov.in సైట్లో అప్లై చేసుకోవాలని సూచించారు. 2 బాక్స్ టైప్ లౌడ్ స్పీకర్లను మాత్రమే వాడాలని, రాత్రి 10 గం. నుంచి ఉ.6 వరకు వాటిని వినియోగించవద్దని తెలిపారు. పూర్తి వివరాల కోసం 8712665785కు కాల్ చేయాలన్నారు.

**గణేశుడిని నిలబెట్టేవారు పాటించాల్సిన నిబంధనలు**

- పోలీస్ పర్మిషన్ తప్పనిసరి
- కరెంట్ కనెక్షన్ కోసం DD అవసరం
- మండపాలతో రోడ్డు మొత్తం బ్లాక్ చేయొద్దు
- కనీసం టూ వీలర్ వెళ్లేందుకైనా దారి ఇవ్వాలి.
- DJలకు అనుమతి లేదు.
- రాత్రి 10 దాటిన తర్వాత మైక్లు ఆఫ్ చేయాలి.
- సీసీ కెమెరాలు బిగించుకోవడం మేలు ఫైర్ సేఫ్టీ కూడా తప్పక పాటించాలని, శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసులు సూచిస్తున్నారు.

### ఆరాంఘర్ రైల్వే ట్రాక్ పరిసరాలలో

## వ్యర్థ రసాయనాల డంప్

**- ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలు**

**రాజేంద్రనగర్, ఆగస్టు26(నమస్తే ఉదయం):** ఆరాంఘర్ రైల్వే ట్రాక్ నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు గత వారం రోజులుగా ముక్కుపుటలదిరే కెమికల్ వాసన వస్తుండటంతో స్థానికులతో పాటు ఆ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. కొందరు అక్రమార్కులు రాత్రి పూట ఇతర ప్రాంతాల నుంచి వ్యర్థ కెమికల్ ను తీసుకొచ్చి పక్కనే ఉన్న కాలువలో డంప్ చేస్తుండటం వలన ఈ వాసన వస్తున్నట్లు ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. దీనిపై పోలీసులు, మీడియా, పత్రిక ప్రతినిధులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.






అత్తాపూర్‌లోని ఢిల్లీ బచ్ పన్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలలో పాల్గొన్న చిన్నారులు




శివరాంపల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు



అత్తాపూర్ హుడా కాలనీలోని ఇస్కాన్ టెంపుల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీ కృష్ణుని దర్శించుకుంటున్న భక్తులు





చిన్ని కృష్ణుని వేషధారణలో జి.రియాన్ని రెడ్డి, యి. అర్జున్ రెడ్డి



దృశ్యుల్ రెడ్డి



గోపిక వేషధారణలో అన్వితా రెడ్డి

### రాజేంద్రనగర్ సర్కిల్‌లో కన్నుల పండుగగా

## కృష్ణాష్టమి వేడుకలు

**రాజేంద్రనగర్, ఆగస్టు26(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. దేవాలయాలు, పాఠశాలలో చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

**ఇస్కాన్ టెంపుల్‌లో...**

అత్తాపూర్ హుడా కాలనీలో గల ఇస్కాన్ టెంపుల్‌లో కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గత వారం రోజులుగా ఇస్కాన్ టెంపుల్‌లో వేడుకలు నిర్వహిస్తున్నారు.


బలరాముని జయంతి నుంచి కృష్ణాష్టమి వరకు అన్నదానాలు , పూజలు, భజనలు నిర్వహించారు. ఇస్కాన్ టెంపుల్ కమిటీ అధ్యక్షులు సీతారాం దాస్, చైతన్య అవతార్ దాస్, ఎస్. హరిదాస్, రాధాకాంత్ దాస్, మధుర్ కన్నయ్య దాస్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

**శివరాపల్లి శ్రీ సరస్వతి శిశు మందిర్ లో...**


శివరాంపల్లి శ్రీ సరస్వతి శిశు మందిర్ , అత్తాపూర్ ఢిల్లీ బచ్ పన్ స్కూల్‌లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



చిన్ని కృష్ణుని వేషధారణలో చిన్నారి అవిఘ్న



గోపిక వేషధారణలో చిన్నారి అవిఘ్న



### కృష్ణాష్టమి సందర్భంగా ప్రతి ఇంట్లో శ్రీకృష్ణుడు గోపిక వేషధారణలతో

## ముస్తాబైన చిన్నారులు

**రాజేంద్రనగర్, ఆగస్టు(ప్రభాత ఉదయం):** చిన్ని కృష్ణులు, గోపిక వేషధారణలతో ప్రతి ఇంట్లో చిన్నారులు కనువిందు చేశారు. కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా తమ ఇళ్లలో ఉన్న చిన్నారులను శ్రీకృష్ణుని రూపంలో, గోపిక వేషధారణలతో అందంగా అలంకరించారు. చిన్నారులు చూడముచ్చటగా కనిపించారు. వారిని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనంద పరవశు లయ్యారు.

## ఆక్రమణలకు తొలగించి ట్రాఫిక్ సమస్యలను తీర్చండి

**ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్లు**

**శంషాబాద్, ఆగస్టు 26(నమస్తే ఉదయం):** తొండుపల్లి వద్ద జాతీయ రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలగించి కోరుతూ చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా రంజిత్ రెడ్డికి స్థానిక నాయకులు వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై తొండుపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణం నత్త నడకన కొనసాగుతుండడంతో రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కౌన్సిలర్లు చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండ విశ్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రోడ్డు పనులను పరిశీలించడానికి సోమవారం ఇక్కడికి విచ్చేసిన కొండా విశ్వేశ్వర్ రెడ్డిని స్థానిక కౌన్సిలర్లు పారేపల్లి లావణ్య శ్రీనివాస్ గౌడ్. పెదిరిపాటి రాణి యాదయ్య గౌడ్ . కొండ ప్రవీణ్ గౌడ్. మాజీ ఉప సర్పంచ్ పెదిరిపాటి ప్రవీణ్ గౌడ్. తదితరులు కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసి స్థానిక సమస్యలపై



ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్థానిక నాయకులు

వినతి పత్రాన్ని అందజేశారు. తొండుపల్లి వద్ద 200 అడుగులు ఉండాల్సిన రోడ్డును ఆక్రమించి అనేక అక్రమ కట్టడాలు వెలిశాయని. డబ్బాలు వేస్తూ యదేచ్ఛగా రోడ్డును ఆక్రమిస్తున్నారని తెలిపారు. దీనితో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం జరుగుతున్నదని ప్రతిరోజు ఉదయం సాయంత్రం మధ్యాహ్నం అని తేడా లేకుండా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతుందని వారు ఎంపీ కి వివరించారు. మరోవైపు ఔటర్ రింగ్ రోడ్ టోల్గేట్ ఎగ్జిట్ 16 ఉండడంతో రింగ్ రోడ్డు పైకి వెళ్లాల్సిన భారీ వాహనాలు కిలోమీటర్ వరకు క్యూ కడుతున్నాయని తెలిపారు. రింగ్ రోడ్డుపై అదనంగా మరో రెండు ఎంట్రీ గేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రావడానికి పోవడానికి రెండు గేట్లు మాత్రమే ఉండడంతో ట్రాఫిక్ జామ్ అవుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఓఆర్ఆర్ అధికారులతో చర్చించి ఇక్కడ ఎగ్జిట్ గేట్ల సంఖ్యను పెంచే విధంగా చూడాలని కోరారు. ఎంపీ మైలారదేవ్పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి. ఏ భీమార్జునారెడ్డి ఉన్నారు. విశ్వేశ్వర్ రెడ్డిని కలిసిన వారిలో స్థానిక నాయకులు కొండా పరమేష్ గౌడ్, బాతుకు శ్రీనివాస్ యాదవ్. బాతుకు మహేష్ యాదవ్. ఇంజమూరి రాజు. కొమ్మ గంటి రాజు గౌడ్. ప్రసాద్ గౌడ్ మునగాల రాజిరెడ్డి.. రాహుల్. వీరేందర్ రెడ్డి. నాగరాజు గౌడ్ తదితరులు ఉన్నారు.

## ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్లకు రక్షణ కల్పించాలి

**పీజీ విద్యార్థిని మౌనిత దెబ్నత్ అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి..**

**శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్...**

**కూకట్‌పల్లి, ఆగస్టు 26 (నమస్తే ఉదయం):** ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్లకు రక్షణ కల్పించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ నగర్‌లో యూత్ కాంగ్రెస్ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కోవొత్తుల శాంతి ర్యాలీలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్లకు రక్షణ కల్పించాలని, మౌనిత దెబ్నత్ కుటుంబానికి




కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

న్యాయం చేయాలని యువకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే దోషులను శిక్షించాలని, ఎంతో ఉజ్వలమైన భవిష్యతు కలిగి ఒక డాక్టరగా సమాజానికి ఎంతో సేవ అందించాల్సిన మౌనిత దెబ్నత్ జీవితం ఈ విధంగా ముగిసిపోవడం చాలా బాధాకరమని అన్నారు.

ఇంతటి దుర్మార్గనికి ఒడికట్టిన వారిని తక్షణమే శిక్షించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు.

ఆఖరికి ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్లకు ఆసుపత్రిలో రక్షణ లేకుండా పోతోందని, విధుల్లో ఉన్న డాక్టర్లే అత్యాచారానికి గురవుతుంటే దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, డివిజన్ నాయకులు, యువకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699. Cell: 9492148733